
మన అంకుశం

అవినీతిపై అక్షర సమరం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 72 | ఆదివారం 31 మే 2026 | పేజీలు : 4 | వెల : 3/-










# తెలుగు రాష్ట్రాల్లో బీభత్సం సృష్టిస్తున్న వాతావరణం

ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ రాష్ట్ర ప్రజలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరనుంది. రాష్ట్రంలోని 119 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 155 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 నుంచి 46 డిగ్రీల వరకు నమోదయ్యే ప్రమాదం ఉంది. అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో గరిష్టంగా 43 నుంచి 44 డిగ్రీల తీవ్రతతో ఎండలు మండిపోనున్నాయి. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 40 నుంచి 42 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఉత్తర తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, దక్షిణ తెలంగాణ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో కొన్నిచోట్ల వాతావరణం చల్లబడనుంది. బాపట్ల, మార్కాపురం, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.



### ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు

# సాగునీరు విడుదల


- హర్షం వ్యక్తం చేసిన రైతులు
- ఇరిగేషన్‌పై ప్రభుత్వం నిర్ణయాలు రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్న మంత్రి కందుల దుర్గేశ్
- ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల
- గోదావరికి జలహారతి ఇచ్చి బటన్ నొక్కి నీరు విడుదల

హైదరాబాద్

నీటిపారుదల వ్యవస్థపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని మంత్రి కందుల దుర్గేశ్ ఈ సందర్భంగా వెల్లడించారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు ఆయన సాగునీరు విడుదల చేశారు. అనంతరం మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల మేలును కోరే ప్రభుత్వమని ప్రస్తావించారు. మంత్రి కందుల దుర్గేశ్?తో పాటు కూటమి ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఆపై గోదావరికి జలహారతి ఇచ్చి మీట నొక్కి నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టా కాలువకు నీటి విడుదలతో తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఆయకట్టు రైతులు ఎంతగానో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తుపానులు, ప్రకృతి - మిగతా3లో

# త్వరలోనే చేతికి సొంతింటి తాళాలు

- లబ్ధిదారులకు గుడ్ న్యూస్.. సర్కార్ గ్రీన్ సిగ్నల్!
- చాలా కాలంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మంది లబ్ధిదారులకు ఈ నిర్ణయం వల్ల నేరుగా ప్రయోజనం చేకూరనుంది
- నిధుల విడుదలతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది
- గృహాల నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో, అతి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను హ్యాండోవర్ చేసేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు



హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో సొంత ఇంటి కలను సాకారం చేసుకునేందుకు ఎదురుచూస్తున్న వేలాది మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయడంతో పాటు, ఆయా హౌసింగ్ సముదాయాలలో అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.273.79 కోట్ల నిధులను విడుదల చేస్తూ పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ టిడ్కో హౌసింగ్ - మిగతా3లో



### తోటి దేశద్రోహ సోరోస్ ఏజెంట్లతో అసలు విషయాలు బయటపెట్టే సంభాషణ జరిపా

- సీబీఎస్ఈ వివాదంపై కాంగ్రెస్ ధ్వజం
- కేంద్రంలోని మోదీ సర్కార్‌పై తీవ్ర విమర్శలు
- మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించినవారు సమాధానాలకు బదులుగా అవమానాలను ఎదుర్కొన్నారన్న హస్తం పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ

### సీడీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి

- మే 30తో ముగిసిన జనరల్ అనిల్ చౌహాన్ పదవీకాలం
- ఆయన స్థానంలో సీడీఎస్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించిన రాజా సుబ్రమణి
- సాయుధ బలగాల్లో స్వదేశీ ఆయుధాల అభివృద్ధిని వేగవంతం చేస్తామని వెల్లడి

### జెన్ జీ కోసం 'సేనాగళం' పేరిట

# ప్రత్యేక కమిటీలు

- ప్రకటించిన పవన్ కల్యాణ్
- జెన్‌జీ గళాన్ని వినిపించడమే 'సేనాగళం' లక్ష్యమని వెల్లడించిన పవన్
- కులం పేరుతో తిట్టే ధోరణి పోవాలని వెల్లడించిన జనసేనాని
- సామాజిక బాధ్యతతో జనసేన పార్టీ ముందుకు వెళ్తుందని వివరణ



అమరావతి

జనసేన పార్టీని మరింత బలోపేతం చేసి, నియోజకవర్గాల వారీగా సంస్థాగతంగా అభివృద్ధికి, జెన్ జీ గళం వినిపించేందుకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ 'సేనాగళం' పేరిట ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన సేనాగళం కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ ప్రకటించడం విశేషం. పవన్ కల్యాణ్: అనంతరం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ జెన్ జీ గళం వినిపించడమే సేనాగళం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆపై సేనాగళం కమిటీకి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. దేశసమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ - మిగతా3లో



# ఎండలున్నాయ్ జాగ్రత్త

- ఎక్కడికెళ్లినా నీళ్లు వెంట తీసుకెళ్లండి'.. ప్రజలకు మోదీ మరోసారి సూచనలు
- ప్రధాని మోదీ 'మనసులో మాట' 134వ ఎపిసోడ్
- ఇటీవల ఝార్ఖండ్‌లో అథ్లెటిక్స్ గురించి ప్రస్తావించిన మోదీ
- మన్‌కీ బాత్‌లో గుర్వీందర్, అనిమేష్‌తో మాట్లాడిన ప్రధాని
- ఆగ్నేయాసియా దేశాలతో వారి సంబంధాల గురించి కూడా సమాచారాన్ని అందిస్తాయి
- చోళ సామ్రాజ్యం గొప్ప చరిత్ర, సంస్కృతి మనందరికి గర్వకారణం
- అటువంటి అమూల్యమైన వారసత్వ సంపదను పరిరక్షించడానికి మా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది.

# ఆ మూడు తప్ప... వైసీపీ టార్గెట్ 172

**విజయవాడ :** వైసీపీ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధపడుతోంది. నిన్న తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమన్వయకర్తలతో సమావేశం అయ్యారు జగన్మోహన్ రెడ్డి. ఎట్టి పరిస్థితుల్లో ఏకగ్రీవాలకు ఒప్పుకునేది లేదని.. ఏకంగా నియోజకవర్గ ఇన్చార్జిలపై వేటు పడుతుందని హెచ్చరించినంత పని చేశారు. అయితే అక్కడే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొందరు.. బాధ్యతలు చూస్తున్న తమపై కాదు.. ఆ కీలక నియోజకవర్గాలపై దృష్టి పెట్టండి అన్నట్టు అంతర్గత చర్చల్లో చెబుతున్నారు వైసీపీ నేతలు. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం, లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి, పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో కనీసం వైసిపి ఉనికి లేదు. నేతల జాడలేదు. ముందుగా అక్కడ పని చూడండి అన్నట్టు వైసిపి నేతల సూచన ఉంది. గత రెండేళ్లలో ఆ మూడు నియోజకవర్గాల్లో వైసిపి చేసిన కార్యక్రమం అంటూ లేకపోవడం విశేషం.వై నాట్ కుప్పం అంటూ సౌండ్ చేశారు వైసీపీ నేతలు. 2024 ఎన్నికల్లో ఎలాగైనా కుప్పంను గెలిచేస్తాం అంటూ పెద్ద ఎత్తున ప్రకటనలు చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి లాంటివారు పెద్దదిక్కుగా మారిపోయారు. తన పుంగనూరు విడిచిపెట్టి మరి కుప్పం పై ఫుల్ ఫోకస్ పెట్టారు. భరత్ అనే నేతకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. చంద్రబాబును సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనీయ లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్క పదవి కూడా వదలకుండా అంతా తీసుకున్నారు. అభివృద్ధి పనులు కూడా పగబట్టి మరీ చేశారు. కానీ కుప్పం ప్రజలు మాత్రం మళ్లీ చంద్రబాబునే పట్టం కట్టారు. ప్రస్తుతం అక్కడ వైసిపి ఇన్చార్జిగా ఉన్న భరత్ జాడలేదు. వైసిపి కార్యక్రమాలు జరగడం లేదు. పట్టించుకునే నాథుడు కూడా అక్కడ లేడు.ఇక మంగళగిరి విషయానికి వస్తే లోకేష్ మానియా నడుస్తోంది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి లోకేష్ వినూత్న తరహాలో ముందుకు వెళుతున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఎంతలా అంటే ప్రతి కుటుంబానికి మేలు జరిగేలా. 2019లో ఓడిపోయిన తర్వాత సొంత ఖర్చుతో అభివృద్ధి చేసి చూపించారు. ఇప్పుడేమో ప్రభుత్వపరంగా చేసి చూపిస్తున్నారు. గతంలో ఉన్న వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి జాడలేదు. మొన్న పోటీ చేసిన మహిళా నేత కనిపించడం లేదు. పైగా అక్కడ మాజీ మంత్రి ఒకరు లోకేష్ పట్ల అనుకూల ప్రకటనలు చేస్తున్నారు.పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం వైయస్సార్



కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలు లేవు. మొన్నటి ఎన్నికల్లో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు ముద్రగడ పద్మనాభం. అయితే ఓడించలేక తన పేరు మార్చుకున్నారు ముద్రగడ పద్మనాభ రెడ్డి గా. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పెండ్యం దొరబాబు సైతం జనసేనలోకి వచ్చేసారు. పవన్ కళ్యాణ్ పై పోటీ చేసిన వంగా గీత ఆచూకీ లేదు. కనీసం అక్కడ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు లేవు. ఈ మూడు చోట్ల ముందు చూడండి.. తరువాత మాట్లాడండి అన్నట్టు ఉంది వైసీపీ నేతల వ్యవహార శైలి.

**గుడివాడలో నాని చేతులెత్తేశారా....**

మాజీ మంత్రి కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి దూరంగా ఉంటున్నారు. రెండు రోజుల క్రితం వైఎస్ జగన్ తో జరిగిన సమావేశంలో పాల్గొన్న కొడాలి నాని గుడివాడకు మాత్రం వెళ్లలేదు. 2024 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత కొడాలి నాని గుడివాడకు దూరమయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గుండెకు శస్త్ర చికిత్స జరగడం కొడాలి నాని హైదరాబాద్ కు మాత్రమే పరిమితమయ్యారు. ఏదైనా పోలీస్ స్టేషన్ కు రావాల్సినప్పుడే గుడివాడకు వస్తున్నారు తప్పించి అంతకు మించి ఆయన ప్రత్యేకంగా గుడివాడ వచ్చి వైసీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనలేదు. గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంత వరకూ గుడివాడలో కార్యకర్తలతో భేటీ కూడా జరపలేదు.కొడాలి నాని మాత్రం గుడివాడలోని తన ముఖ్య అనుచరులతో టచ్ లోనే ఉన్నారు. హైదరాబాద్ లోనే ఎక్కువ కొడాలి నాని ఉంటున్నారు. అయితే ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉండటంతో ఇప్పుడే రావడం అనవసరమని కొడాలి నాని భావిస్తున్నట్లుంది. గత ఎన్నికల్లో తన ఓటమిని జీర్ణించుకోలేని కొడాలి నాని తాను నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు తనను ఓడించడంపై ఒకింత అసంతృప్తితో తొలుత ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. గుడివాడ నియోజకవర్గంలోతొలి సారి ఓటమి పాలయిన తర్వాత గుడివాడకు పూర్తి దూరం పాటిస్తున్నారు. విజయవాడ వరకూ వచ్చి గుడివాడకు వెళ్లకపోవడం చర్చనీయాంశమైంది.2004 కొడాలి నాని టీడీపీ నుంచి తొలిసారి గుడివాడ ఎమ్మెల్యేగా కొడాలి నాని ఎన్నికయ్యారు. 2009లోనూ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2014 ఎన్నికలకు వచ్చేసరికి వైసీపీలోకి వెళ్లారు.ఆ ఎన్నికలలో విజయం సాధించారు. 2019 ఎన్నికల్లో మాత్రం వెనిగండ్ల రాము చేతిలో ఓటమి పాలయ్యారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దాదాపు రెండున్నరేళ్లు మంత్రిగా పనిచేశారు. కానీ ఇప్పుడు గుడివాడకు వచ్చినా చేసేదేమీ లేదని, ఎన్నికలకు ఏడాది ముందు వచ్చి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ మేరకు వైసీపీ అధినేత జగన్ నుంచి అనుమతి కూడా కొడాలి నాని తీసుకున్నట్లు తెలిసిం

# మే నెలలో తలనీలాల రికార్డు

**తిరుమల :** తిరుమలలో తలనీలాల సమర్పణలో ఏటికేడు కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. మే నెలలో గతంలో ఎన్నడూలేని విధంగా అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ వెల్లడించింది. గత సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయిలో తలనీలాల సమర్పణ జరిగినట్లు తెలిపింది. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా కళ్యాణకట్టల వద్ద ఏర్పాట్లు చేశామని.. పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించింది.తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించే భక్తుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే మే నెలలో కొత్త రికార్డులు నమోదు చేసింది. గత సంవత్సరాల కంటే 2026 మే నెలలో అత్యధిక మంది భక్తులు తలనీలాలు సమర్పించడం విశేషం. ఈ నేపథ్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా టీటీడీ ఏర్పాట్లు చేపట్టి, నిరంతరాయంగా సేవలు అందిస్తోంది. ఇక ఈ ఏడాది మే నెలలో 14,43,063 మంది భక్తులు తిరుమల శ్రీవారికి తమ తలనీలాలు సమర్పించుకున్నారు. 2024 మే నెలలో 10,65,729 మంది భక్తులు, 2025 మేలో 10,18,370 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకుంటే.. ఈ ఏడాది మే నెల కొత్త రికార్డులు నమోదు చేసింది.మరోవైపు ఇటీవల వేసవి సెలవులు, వారాంతపు రద్దీతో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. మే 18వ తేదీ నుంచి మే 23వ తేదీ వరకు వరుసగా ఆరు రోజుల పాటూ రోజూ 50 వేల మందికిపైగా భక్తులు తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మరీ ముఖ్యంగా మే 23వ తేదీ ఒక్కరోజే 57,580 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నట్లు టీటీడీ తెలిపింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తలనీలాల సమర్పణకు ఎక్కువ సమయం పట్టకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.ప్రధాన కళ్యాణకట్ట సహా పీఏసీ-1, పీఏసీ-2, పీఏసీ-3, పీఏసీ-5, జీఎన్సీ, హెచ్‌వీసీ, సప్తగిరి, నందకం, కౌస్తుభం, శ్రీవేంకటేశ్వర, శ్రీ పద్మావతి విశ్రాంతి గృహాలతో పాటుగా మొత్తం 11 మినీ కళ్యాణకట్టలు భక్తులకు అందుబాటులో ఉంచినట్లు టీటీడీ తెలిపింది. మొత్తం 1152 మంది క్షురకులు, అందులో 269 మంది మహిళా క్షురకులు భక్తులకు సేవలు అందిస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కొక్కరు తమ 6 గంటల షిఫ్టులో 40 మందికి సేవ చేస్తారని తెలిపింది. మరోవైపు భక్తుల రద్దీకి అనుగుణంగా 250 మంది



సిబ్బందికి అదనంగా విధులు కేటాయించినట్లు వెల్లడించింది.మరోవైపు తిరుమలకు వచ్చే శ్రీవారి భక్తులు కళ్యాణకట్టను అత్యంత పవిత్రంగా భావిస్తుంటారని.. అందుకే భక్తులకు ఇబ్బందులు కలగకుండా కళ్యాణకట్టలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు టీటీడీ తెలిపింది. భక్తులకు కేటాయించే బ్లేడ్లు కూడా ముందుగా సోడియం సొల్యూషన్ లో ముంచి, డెటాయిల్‌తో శుభ్రపరుస్తున్నట్లు తెలిపింది. భక్తులు సమర్పించే తలనీలాలను ఎప్పటికప్పుడు సేకరించి భద్రపరుస్తున్నట్లు తెలిపింది. తలనీలాల సమర్పణ తర్వాత చందనం బిళ్లలు కూడా అందిస్తున్నట్లు వివరించింది.

**వైకుంఠం కాంప్లెక్స్ 3**

తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 ప్రతిపాదన గతంలోనే వచ్చింది.. కానీ ఈ ప్రతిపాదనను స్థానికులు వ్యతిరేకించడంతో ఆగిపోయింది. తాజాగా మరోసారి ఈ ప్రతిపాదన తెరపైకి రాగా.. టీటీడీ అడిషనల్ ఈవో వెంకయ్యచౌదరి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. కొత్తగా క్యూ కాంప్లె?క్స్ నిర్మించడానికి స్థలాన్ని గుర్తించే పనిలో ఉన్నారు. తిరుమలలో సుపథం మార్గం దగ్గర కొన్ని ఇళ్లు ఉండేవి.. శ్రీవారి ఆలయాన్ని విస్తరిస్తున్న సమయంలో అక్కడున్న 84 కుటుంబాలను తరలించి ఆర్‌బీ సెంటర్‌లో ఇళ్లు నిర్మించి ఇచ్చారు. అది కూడా 20 ఏళ్ల పాటూ లీజు కింద నామమాత్రపు అద్దెతో కేటాయించా.. ఆ గడువు ముగిసింది. ఆ ఇళ్లపై తమకు శాశ్వత యాజమాన్య హక్కు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. టీటీడీ అధికారుల్ని కలిసి ఈ అంశంపై విన్నవించినా ఒప్పుకోలేదు. కొంతమంది కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు.ప్రస్తుతం టీటీడీ ప్లాన్ చేస్తున్న వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3ని ఇదే స్థలంలో నిర్మించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. ఈ క్రమంలో ఆర్‌బీ సెంటర్‌లో ఉన్న స్థానికులు వారి సమస్యల్ని, డిమాండ్లను టీటీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. టీటీడీ పాలకమండలి సభ్యులు ఈ అంశంపై స్థానికులతో మాట్లాడారు. టీటీడీ ఆలయ ఉన్నతాధికారులతో కూడా స్థానికులు సమావేశమయ్యారు. తమకు తిరుమల బాలాజీనగర్‌లో ఇళ్లు కట్టించి ఇవ్వాలని.. అప్పుడు ఆర్‌బీ సెంటర్‌ను ఖాళీ చేస్తామన్నారు. అయితే టీటీడీ అధికారులు మాత్రం తిరుమల కాదు తిరుపతిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని వారితో చెప్పారు. టీటీడీలో ఉద్యోగాలతో పాటుగా తిరుమలలో షాపులు కేటాయించాలని డిమాండ్ చేయగా.. అధికారులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణం అంశంపై టీటీడీ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

# జగన్ మూడో కూటమి వైపు చూపు....

**కడప :** బిజెపి విషయంలో జగన్మోహన్ రెడ్డి స్టాండ్ మారుతున్నట్లు అర్థం అవుతోంది. ఢిల్లీ వర్గాల్లో సైతం ఇది చర్చకు దారితీస్తుంది. వరుసగా జరుగుతున్న పరిణామాలు చూస్తే జగన్మోహన్ రెడ్డి ఒక పక్కా ఆలోచనతో అడుగులు వేస్తున్నట్లు స్పష్టమౌతోంది. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ పెంపును నిరసిస్తూ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమికి ఆయన విశ్లేషిస్తున్న కారణాలు.. భారతీయ జనతా పార్టీకి కోపం తెప్పిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం బిజెపిని నమ్ముకుంటే రాజకీయంగా తనకు ఇబ్బందులు తప్పవని జగన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఏపీలో ఎన్డీఏ కూటమి బలంగా ఉన్న నేపథ్యంలో.. తనకు జాతీయస్థాయిలో ఏదో ఒక కూటమి అండ ఉండాలని ఆయన భావిస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది ఢిల్లీ వర్గాల్లో. ఈ విషయం బిజెపి పెద్దల వరకు తెలియడంతో వారు సైతం జగన్మోహన్ రెడ్డి విషయంలో సాఫ్ట్ కార్నర్ విడిచి పెట్టే పరిస్థితి కనిపిస్తోంది.ఏపీలో ప్రత్యేక ఓటరు సవరణ చేపడుతున్న సంగతి తెలిసిందే. దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు జగన్మోహన్ రెడ్డి. రాజకీయ ప్రత్యర్థుల ఓట్లను తొలగించడమే దీని వెనుక ఉన్న ఎత్తుగడ అని చెబుతున్నారు జగన్. బెంగాల్లో మమతా బెనర్జీ ఓటమికి ఓటరు జాబితా సవరణ కారణం అని తేల్చి చెప్పారు. తద్వారా బిజెపి గెలుపును తప్పుపట్టారు. ఎన్నికల సంఘం నిర్ణయాలను సైతం ఎత్తిచూపుతున్నారు. మొన్నటికి మొన్న డీజిల్ పెట్రోల్ ధర పెంపు పై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేశారు. పశ్చిమ ఆసియా పరిణామాల క్రమంలో పెంపు అనివార్యం అని తెలిసి కూడా.. ఇలా ఆందోళనలు చేయడం ఏంటనేది బిజెపి పెద్దల ప్రశ్న. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి బిజెపితో కటీఫ్ చెప్పేందుకే నిర్ణయించినట్లు తెలుస్తోందిప్రస్తుతం ఏపీలో కూటమి బలంగా ఉంది. పైగా మూడు పార్టీల మధ్య సంబంధాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బిజెపిని నమ్ముకుంటే ఇబ్బందులు అని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## జెన్ జీ కోసం 'సేనాగళం' పేరిట ప్రత్యేక కమిటీలు

-మొదటిపేజీ తరువాయి

దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. రాజ్యాంగానికి కట్టుబడి, అన్ని వర్గాలకు గౌరవం ఇస్తూ, దేశ సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరించేలా ఈ కమిటీ పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.

**కులం పేరుతో తిట్టే ధోరణి పోవాలన్న పవన్**

ఏ కులం వారిని అదే కులం వారితో తిట్టించే ధోరణి పోవాలని పవన్ అన్నారు. బూర్జువా ధోరణిని తోసిరాజంటూ సేనా గళం పని చేయాలన్నారు. అభ్యుదయ భావాలతో ముందుకు వెళ్లాలని, బూజుపట్టిన విధానాలకు తిలోదకాలు ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీగా సామాజిక బాధ్యతతో జనసేన పార్టీ ముందుకు వెళ్తుందని వివరించారు. వ్యక్తుల తప్పులను వారి వ్యక్తిగత చర్యలుగా కాకుండా, కులం, మతం లేదా వర్గాలతో ముడిపెట్టి సామాజిక విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇది సమాజంలో విద్వేషాలకు కారణం అవుతోందని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కులం, మతం, ప్రాంతీయత ముసుగు వేసుకుని దాక్కుంటున్నారన్నారు. ఇటువంటి రాజకీయ సంస్కృతిని నేటి యువత తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలన్నారు. వ్యక్తిగత తప్పులను వ్యక్తిగత స్థాయిలోనే ప్రశ్నించాలి తప్ప, సామాజిక వర్గాలను ఆ వ్యవహారంలోకి లాగకూడదనే స్పష్టమైన విధానాన్ని జనసేన పార్టీ అవలంబిస్తోందని ఈ సందర్భంగా జనసేనాని పవన్ కల్యాణ్ తెలియజేశారు.

## ధవళేశ్వరం బ్యారేజీ నుంచి ఖరీఫ్‌కు సాగునీరు విడుదల

-మొదటిపేజీ తరువాయి

వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు సాగు విధానాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. దీనికోసం గోదావరి డెల్టా కు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ఒకరోజు ముందే సాగునీరు విడుదల చేసిందన్నారు. ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్ కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు.

**రైతులు నాట్లు తొందరగా వేసుకోవాలని సూచన**

ప్రస్తుతం తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తున్నామని, 15 రోజుల్లో కాలువల మరమ్మతులు పూర్తి కాగానే దశలవారీగా మిగిలిన కాలువలకు నీరు విడుదల చేస్తామన్నారు. ముందస్తు నీటి విడుదల వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ముందుగానే వరి సాగు చేసుకునే అవకాశం లభిస్తుందన్నారు. రైతులు నాట్లు తొందరగా వేసుకోవాలని, తద్వారా తుపానులు రాకముందే పంట త్వరగా చేతికందుతుందని మంత్రి కందుల దుర్గేశ్ ఈ సందర్భంగా రైతులందరికీ సూచించారు.

"తుపానులు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు సాగు విధానాన్ని కూటమి ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనికోసం గోదావరి డెల్టా కు ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ఒకరోజు ముందే సాగునీరు విడుదల చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు గోదావరి డెల్టాకు నీరు విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు నీరు విడుదల చేస్తున్నామని, అయితే మరో 15 రోజుల్లో కాలువల మరమ్మతులు పూర్తి కాగానే దశలవారీగా మిగిలిన కాలువలకు నీరు విడుదల చేస్తాం. ముందస్తు నీటి విడుదల వల్ల ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో ముందుగానే వరి సాగు చేసుకునే అవకాశం లభిస్తుంది. రైతులు నాట్లు తొందరగా వేసుకోవాలి. తద్వారా తుపానులు రాకముందే పంట త్వరగా చేతికందుతుంది"

రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఇక్కడి నీటి కాలుష్యాన్ని తగ్గించే విధంగా పంచాయతీ రాజ్ శాఖ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తరఫున వంద కోట్లు రూపాయలు ఇస్తామని ప్రకటించినందుకు ధన్యవాదాలని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం వచ్చే ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతన్నలందరూ నాట్లు వేసుకుని, పంట పండించుకోవడంతో పాటు సంక్షేమంగా ఉండాలని కోరుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేశ్ రైతులందరికీ విజ్ఞప్తి చేశారు.

## త్వరలోనే చేతికి సొంతింటి తాళాలు..

-మొదటిపేజీ తరువాయి

సముదాయాల్లో నిలిచిపోయిన పనులకు మోక్షం లభించనుంది. కేవలం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయడమే కాకుండా, లబ్ధిదారులు అక్కడ నివసించడానికి అనుకూలంగా అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నిధుల విడుదలతో టిడ్కో గృహాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధి పనులు వేగవంతం కానున్నాయి. ప్రధానంగా లబ్ధిదారుల కాలనీలలో రోడ్ల నిర్మాణం, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర విద్యుత్ సరఫరా మరియు తాగునీటి వసతి కల్పన వంటి పనులకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

**ఈ నిర్ణయం వల్ల కలిగే ముఖ్య ప్రయోజనాలు:**

మౌలిక వసతుల అభివృద్ధి: కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ పనులు వేగంగా పూర్తవుతాయి.

వేలాది మందికి ప్రయోజనం: ఇళ్ల కోసం ఎప్పటినుంచో నిరీక్షిస్తున్న వేలాది మంది లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడనుంది.

పంపిణీ ప్రక్రియకు ఊతం: మౌలిక వసతులు పూర్తికాగానే ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించే ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది.

చాలా కాలంగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాక, మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్న వేలాది మంది లబ్ధిదారులకు ఈ నిర్ణయం వల్ల నేరుగా ప్రయోజనం చేకూరనుంది. నిధుల విడుదలతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. గృహాల నిర్మాణం చివరి దశకు చేరుకోవడంతో, అతి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను హ్యాండోవర్ చేసేందుకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. సొంత ఇంటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం వేసిన ఈ ముందడుగుపై లబ్ధిదారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## మద్యం స్కాంలో బుక్కైన విజయసాయి

**నెల్లూరు :** ఏపీలో మద్యం కుంభకోణం ప్రకంపనలు సృష్టించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఒకవైపు విచారణ చేపడుతుండగా.. సమాంతరంగా ఈడి కూడా దర్యాప్తు చేస్తోంది. తాజాగా వైయస్సార్ కాంగ్రెస్ మాజీ నేత విజయసాయిరెడ్డిని పిలిచి మరి విచారణ చేసింది ఈడి. ఏకంగా ఏడు గంటల పాటు విచారణ కొనసాగింది. విజయసాయిరెడ్డిని ఈడి విచారణ చేపట్టడం ఇది మూడోసారి. అయితే ఈసారి విజయసాయిరెడ్డి మొబైల్ ఫోన్ చుట్టూ విచారణ కొనసాగినట్లు సమాచారం. గతసారి ఈడి తనిఖీల సమయంలో విజయసాయిరెడ్డి వ్యక్తిగత ఫోన్ ను ఈడి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా దర్యాప్తులో భాగంగా విజయసాయిరెడ్డి ఎదుట ఆ సెల్ ఫోన్ లో ఉన్న వివరాలను ఫోరెన్సిక్ నిపుణులు క్లోనింగ్ చేపట్టారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి విజయసాయిరెడ్డిని విచారించే అవకాశం ఉంది.దాదాపు 7 గంటల పాటు ఈడి ఎదుట ఉండిపోయారు విజయసాయిరెడ్డి. హైదరాబాదులోని ఈడీ కార్యాలయం వద్ద ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. దర్యాప్తు అనంతరం మీడియా ముందుకు వచ్చిన విజయసాయిరెడ్డి అసలు తనను విచారణ చేపట్టలేదని.. తన సమక్షంలో ఫోన్లో ఉన్న వివరాలను తీసుకున్నారని చెప్పుకొచ్చారు. ల్యాబ్ నివేదిక వచ్చిన వెంటనే మరోసారి సమన్లు జారీ చేసి తనను పిలిచే అవకాశం ఉందని విజయసాయిరెడ్డి స్వయంగా పేర్కొనడం విశేషం. అయితే ఈ కేసుతో తనకు ఎటువంటి సంబంధం లేదు అని.. మొత్తం వ్యవహారం నడిపింది రాజ్ కసిరెడ్డి అని.. ఈ విషయం ఎన్నిసార్లు అడిగినా చెబుతానని తేల్చి చెప్పారు విజయసాయిరెడ్డి.అయితే ఇప్పుడు విజయసాయిరెడ్డి ఫోన్ కీలకంగా మారింది. ఐదేళ్లపాటు వైసీపీ హయాంలో విజయసాయిరెడ్డి ద్వారా జరిగిన లావాదేవీల లోగుట్టులు బయటపడే అవకాశం ఉంది. మద్యం కంపెనీల విషయంలో తాను మధ్యవర్తిత్వం వహించానని.. ఇప్పటికే పలుమార్లు హింట్ ఇచ్చారు విజయసాయిరెడ్డి. ఇప్పుడు ఏకంగా ఆయన సెల్ఫోన్ దొరకడంతో ఈడి అధికారులు డొంక మొత్తం కదిలించనున్నారు. విజయసాయిరెడ్డి నేరుగా చెప్పడం కంటే తన సెల్ ఫోన్ ద్వారా మొత్తం గుట్టు రట్టు చేశారు అనడం వాస్తవం. వైసిపి హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని విజయసాయిరెడ్డి ఒప్పుకున్నారు.

# కెవి రమణ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలి

- కెవి రమణ గారికి అభినందనలు!

**అంకుశం న్యూస్ అనంతపురం మే 31:** వైయస్సార్సీపి పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని పార్టీలో పని చేసే నాయకులకు కార్యకర్తలకు ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని కెవి రమణకు పదవి ఇవ్వడం ద్వారా వైయస్ జగన్ మరోసారి నిరూపించారని అనంతపురం జిల్లా వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కేవి రమణ ని గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధిగా ఎంపిక చేసిన సందర్భంగా వైయస్సార్సీపి జిల్లా పార్టీ ఆఫీసులో బెస్త సాధికార కమిటీ ఆధ్వర్యంలో ఈరోజు అభినందన సభ జరిగింది.

ఈ సభలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి,ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ,వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు నల్లపురెడ్డి,మాజీ మేయర్ వసీం సలీం,వైఎస్ఆర్సిపి పిఎసి సభ్యులు నదీ మహమ్మద్,హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి, రిలాక్స్ నాగరాజు,జిల్లా అధికార ప్రతినిధి సిపి వీరన్న పాల్గొని ప్రసంగించారు.వీరు మాట్లాడుతూ వైయస్సార్సీపి సరైన సమయంలో రాయలసీమ పట్ల సమగ్రమైన అవగాహన కలిగిన కె.వి.రమణ గారిని అధికార



ప్రతినిధిగా నియమించడం ముదావహమని,అలాగే కేవీ రమణ గారు మచ్చలేని మనిషిగా తన జీవితమంతా పేద ప్రజల కోసం పనిచేశారని,అభివృద్ధి వికేంద్రీకరణ తోనే రాష్ట్రం సమగ్రాభి వృద్ధి చెందుతుందని నమ్మిన వ్యక్తి ,ప్రత్యర్థులు కూడా మెచ్చుకోదగ్గ మేధావి వర్గమని కొనియాడారు.భవిష్యత్తులో వైఎస్ఆర్సిపి బలోపేతానికి, అధికారపక్షం దుర్మార్గాలను ఎండ కట్టడానికి నిర్మాణాత్మకమైన సూచనలతో మీడియా, సోషల్ మీడియాలో డిబేట్స్ చేయాలని,అందులకు అనంతపురం జిల్లా పార్టీ యావత్తు కె.వి.రమణకు అండగా నిలబడుతుందని తెలియజేశారు.

ఈ సందర్భంగా కె.వి రమణ మాట్లాడుతూ నాపై విశ్వాసం, నమ్మకం ఉంచి ఇంత బృహత్తర బాధ్యతను



అప్పగించిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ బాధ్యతలు అప్పగించడానికి జిల్లా నుంచి కృషిచేసిన జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి , విశ్వేశ్వర్ రెడ్డి కి అలాగే అనంతపురం జిల్లా అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తలకు కృతజ్ఞతలు,ధన్యవాదాలు తెలియజేశారు.రాష్ట్రంలో నేడు భయంకరమైన పరిస్థితి నెలకొన్నాయని,ఈ పరిస్థితులు పోవాలంటే వైసీపీ అధికారంలోకి రావాలని అందులకు మనమందరం సమిష్టిగా పనిచేయాలని, నా వంతుగా అహర్నిశలు పనిచేస్తానని ప్రతిజ్ఞ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి పార్టీ నాయకులు,కార్యకర్తలు,కె.వి రమణ గారి స్నేహితులు, బంధువులు, శ్రేయోభిలాషులు బెస్త సాధికారిక నాయకులు కే శ్రీనివాసులు,సురేష్, ఎర్రి స్వామి కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జూన్ 10 నుంచి 15 వరకు సిపిఐ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

- మోదీ, చంద్రబాబు హయాంలో ధరల బాదుడు
- జూన్ 1 నుంచి 7 వరకు వామపక్షాల ప్రచారం
- జూన్ 9 న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**అంకుశం న్యూస్ విజయవాడ మే 31:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 15 వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని స్నేహ గార్డెన్‌లో పార్టీ శ్రేణులకు రాష్ట్రస్థాయి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య వెల్లడించారు. ఈ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా హాజరవుతారన్నారు. మార్క్సిస్టు అధ్యయన కేంద్రాల నుంచి ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై బోధించేందుకుగాను అనేక మంది ప్రముఖులు ఉపాధ్యాయులుగాను, ఏపీ, తెలంగాణ నుంచి మేధావులు విచ్చేస్తారని తెలిపారు. విజయవాడ దాసరి భవన్‌లో ఆదివారం ఈశ్వరయ్య విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర సమితి సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు ప్రతినిధులుగా హాజరవుతారని తెలిపారు. వర్తమాన రాజకీయ అంశాలపై, ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ స్థితిగతులపైన అధ్యయనం చేసేందుకుగాను; కేంద్రంలోని, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగట్టేందుకుగాను, భవిష్యత్తు పోరాటాలకు మరింత సన్నద్ధమయ్యేందుకు ఈ శిక్షణా తరగతులు దోహదపడతాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన జూన్ 1వ తేదీన జరిగే పోరాటానికి సిపిఐ రాష్ట్ర సమితి సంపూర్ణ సంఘీభావం ప్రకటిస్తున్నదన్నారు. రైతాంగ సమస్యలపై చంద్రబాబు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్నదేగాని, రైతులు పండించిన పంటలకు కల్పించడంలో విఫలమైందన్నారు. మొక్కజొన్న, వర్జీనియో పొగాకులకు గిట్టుబాటు ధరలు లేకపోయాయన్నారు. ఖోఖో నుంచి దానిమ్మ, బత్తాయి రైతుల వరకు ఆందోళనతో ఉన్నారన్నారు. మహానాడు వేదికగా సీఎం చంద్రబాబు ఆర్భాటపు వ్యాఖ్యలేగానీ, రైతాంగ సమస్యల పరిష్కానానికి నిర్దిష్టమైన ప్రకటన ఒక్కటీ చేయకపోవడం దారుణమని అన్నారు. నీటి పారుదల ప్రాజెక్టుల అంశంలోను, అన్నదాత సుఖీభవలోను ఈ ప్రభుత్వం రైతుల పట్ల



మోసపూరిత విధానాల్ని అవలంభిస్తోందని మండిపడ్డారు. జూన్ 1 నుంచి 7వ తేదీ వరకు రాష్ట్రంలోని పది వామపక్షాల నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నిరసిస్తూ; ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు. 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పది వామపక్షాల నేతృత్వంలో రాస్తారోకోలకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.దుర్గాభవాని, దోనేపూడి శంకర్ పాల్గొన్నారు

## చిన్నారులకు చిత్రలేఖనంపై అవగాహన





**అంకుశం న్యూస్, అనంతపురం, మే 31:** దండువారిపల్లిలో ఉచిత చిత్రకళ శిక్షణ కార్యక్రమం 70 మంది చిన్నారులతో కళాఖండాల సృష్టి అనంతపురం జిల్లా, బుక్కరాయసముద్రం మండలం, దండువారిపల్లి గ్రామంలో వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులకు చిత్రలేఖనంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్రకారుడు ఎస్. వెంకట నరసయ్య పిల్లలకు వాటర్ కలర్స్ మరియు చిత్రకళలోని మౌలిక అంశాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చిత్రకళపై ఆసక్తి ఉన్నప్పటికీ భయం మరియు సంకోచం కారణంగా చాలా మంది పిల్లలు తమ ప్రతిభను బయటపెట్టలేకపోతున్నారని తెలిపారు. అలాంటి పిల్లలకు సులభమైన పద్ధతుల్లో చిత్రలేఖనంపై అవగాహన కల్పించి, వారి చేత స్వయంగా అందమైన చిత్రాలను రూపొందించే విధంగా శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణ అనంతరం పిల్లలు రూపొందించిన చిత్రాలను చూసి వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. తమ చేతులతో తాము రూపొందించిన కళాఖండాలు చూసి చిన్నారులు ఉత్సాహం వ్యక్తం చేయడం విశేషంగా నిలిచింది. ఈ శిక్షణా కార్యక్రమంలో సి.హెచ్. జాన్సన్, వి. పవిత్ర, టి. విశ్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఘన సన్మానం

**అంకుశం న్యూస్ మే 31 గోరంట్ల :-** ఈ సంవత్సరం పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు చౌడేశ్వరి కాలనీలోని రామాలయం నందు జ్ఞాపికతో కూడిన సత్కారం చేయడం జరిగింది . పదవ తరగతిలో బాలుర హై స్కూల్ నందు 577 మార్కులతో కర్ణా సోమశేఖర్ . బాలికల హైస్కూల్ నందు 590 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన ముక్తాపురం హర్షిత కు తుంకూర్ కాలేజ్ నందు లెక్చరర్ గా పనిచేయుచున్న దేవాంగ కెంపుల కుసుమ . కెంపుల శ్రీనివాస్ దంపతులచే ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు . ప్రతి ఒక్కరికి భగవద్గీత నోట్ బుక్స్. పెన్నులు అట్టలు శాలువతో పాటు జ్ఞాపికతో సన్మానం చేయడం జరిగింది . వీరితోపాటు భాగ్యశ్రీ .జోష్ణ సాయి జోష్ణ. శశాంక్ .విష్ణువర్ధన్ .జ్ఞానేశ్వర్. సాయి గీత .మోక్షజ్ఞ .పల్లవి. మంజునాథ్ .భవిష్య. నవల తో పాటు 25 మందికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు దేవాంగం జగదీశ్వర లేపాక్షి హై స్కూల్ నందు తెలుగు పండిట్ గా పనిచేయుచున్న కెంపుల నాగభూషణ్ గారి ఆధ్వర్యంలో దాతలు వసుంధర జ్యువెలర్స్ రామాంజనేయులు టీచర్ దేవాంగం శ్రీనివాసులు బండారు రిషికేశవ మెడికల్ స్టోర్ పుట్టపర్తి .కట్టా నారాయణ దాతల ఆర్థిక సహకారంతో నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ



కులాభివృద్ధికి కృషి చేయుచున్న శ్రీ జగదీశ్వర్ గారికి సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు భగవద్గీత ప్రాధాన్యతను గూర్చి ప్రవచన కారులో వట్టి నారప్ప తెలియజేశారు .ఈ కార్యక్రమాన్ని శ్రీ సత్య సాయి అక్షర జ్యోతి శిక్షణా కేంద్రం నిర్వాహకులు శ్రీ దేవాంగం జగదీశ్వర గారి పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. కార్యక్రమానంతరము అందరికీ అల్పాహారము ఏర్పాటు చేయడం జరిగింది . ఇలాంటి కార్యక్రమాలు నిర్వహణ పట్ల తల్లిదండ్రులు కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించడానికి ఆర్థిక సహాయం అందజేసిన దాతలు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని జగదీశ్వర్ తెలిపారు.

# ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలి

- దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షు లు హనుమంతు



**అంకుశం న్యూస్. మడకశిర మే.31:** ప్రజాస్వామ్యానికి నాలుగో, మూల కారణం స్తంభం లాంటిదని జర్నలి జం అని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షు లు హనుమంతు అన్నారు. అలాంటి జర్నలిజం లో సీనియర్ జర్నలిస్ట్, రాజకీయ విశ్లే షకులు ప్రొఫెసర్ కె. నాగేశ్వ రరావు నమోదైన కేసులను తక్షణమే ఉపసంహరించా లని డిమాండ్ చేశారు. కేవలం ఒక టివి ఛానల్లోని ప్రోగ్రాంలోని డెబిట్ లో చేసిన వ్యాఖ్యల కు కక్ష సాధింపు ధోరణితో కేసులు పెట్టడం, అరెస్టులకు ప్రయత్నించడం బావ ప్రకట న స్వేచ్ఛకు, రాజ్యంగా హక్కులకు విరుద్ధమని అన్నారు. ప్రభుత్వాలు, నాయకులు విమర్శలను సద్భావనతో స్వీకరించాల ని,ఒక జర్నలిస్ట్ తనకు అం దిన సమాచారాన్ని ప్రజల ముందు పెట్టడానికి ప్రయ త్నించడం నేరం ఎలా అవుతుందని ప్రశ్నించారు. సమాచారం తప్పని తెలిసి న వెంటనే ప్రొఫెసర్ నాగేశ్వ రరావు బేషరతుగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు క్షమా పణ కూడా చెప్పారన్నారు. అయినప్పటికీ ప్రొఫెసర్ నాగేశ్వరావు వేధించడం ఏంటని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జర్నలిస్టుల గొంతు నొక్కే చర్యలను ఆపాలని డిమాండ్ చేసారు. ప్రజాస్వామ్యంలోచర్చ,విమర్శ, భిన్నాభిప్రాయాలకు ఎప్పుడూ స్థానం ఉండాల ని ప్రొఫెసర్ 'నాగేశ్వరరావు పై కేసులు పెట్టడం ప్రజాస్వా మ్యానికి, వాక్ స్వాతంత్ర్యా నికి గొడ్డలిపెట్టని తప్పని తెలిసిన వెంటనే క్షమాపణ చెప్పినా జర్నలిస్ట్‌పై కక్షసా ధింపు చర్యలు తగవన్నా రు. ఇప్పటికైనా అతనిపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలిని ప్రభుత్వన్ని కోరారు.

## విద్యా ప్రదాత జాన్ రెడ్డి కి ఘనంగా నివాళులు



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 31:** ధర్మవరం పట్టణం లో చాలా కాలంగా విద్యా సంస్థ అధినేత గా, విద్యా ప్రదాత గాసేవలు అందించిన సెయింట్ మేరీ విద్యా సంస్థ అధినేత కె. జాన్ రెడ్డి కి ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా కొత్త పేట క్యాదాలిక్ చర్చ్ లో జరిగిన సంతాప సభ కార్యక్రమం లో ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమం లో బత్తలపల్లి తెలుగుదేశం ఎస్ సి సెల్ నాయకులు యూ. చంద్ర శేఖర్, ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ, ఉపాధ్యాయని బృందం శ్రద్ధాంజలి ఘటించారు ఆయన సతీమణి శ్రీ మతి కొడదల చిన్నమ్మ కుటుంబ సభ్యులు కొత్త పేట చర్చ్ బృందం పలువురు జాన్ రెడ్డి మిత్రులు కన్నీటి నివాళులు అర్పించారు. ప్రార్థన అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## ధర్మవరం లయన్స్ క్లబ్ సేవలకు ప్రశంసలు




**అంకుశం న్యూస్ ధర్మవరం మే 31:** అనంతపురం జిల్లాలోని తాడిపత్రిలో జరిగిన లయన్స్ ఇంటర్నేషనల్ ఎనిమిదవ జిల్లా కన్వెన్షన్ కార్యక్రమంలో ధర్మవరం లైన్స్ క్లబ్ చేస్తున్న సేవలకు జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ గోపాలకృష్ణ అభినందన ప్రశంసలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం లయన్స్ క్లబ్ ఎన్నో సేవా కార్యక్రమాలను, ఉచిత కంటి శాస్త్ర చికిత్స శిబిరాలు, ప్రభుత్వ సేవా కార్యక్రమాలు, వివిధ భాషా దినోత్సవాలు, జాతీయ క్రీడో దినోత్సవాలు వంటి కార్యక్రమాలు నిర్వహణలో తాడిపత్రి లైన్స్ క్లబ్ వారు పూర్తిగా అభినందించి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ధర్మవరంలో మరిన్ని సేవా కార్యక్రమాలలో ముమ్మందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం లైన్స్ క్లబ్ అధ్యక్షులు ఆకులేటి రమేష్ బాబు, కార్యదర్శి నాగేంద్ర, జోనల్ చైర్మన్ వేణుగోపాలచార్యులు, మరియూ లయన్ గూడూరు మోహన్ దాస్, తదితరులు వివిధ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## నాగ మోహన్ కి ఘన సన్మానశీ



**అంకుశం న్యూస్ ధర్మవరం మే 31:** ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీ నాగ మోహన్ 34 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించి పదవి విరమణ చేయడం జరిగింది. జి.నాగ మోహన్ గారి పదవీ విరమణ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారము రోజున ధర్మవరం పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఘనంగా పదవీ విరమణ ఆత్మీయ సన్మాన మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా దేవీ నర్సింగ్ హోమ్ డైరెక్టర్ శ్రీమతి పద్మాగారు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి ,బుక్కపట్నం మండలం సింగల్ విండో అధ్యక్షులు చిన్ని కృష్ణ , కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి రిటైర్డ్ మున్సిపల్ ఇంజనీర్లు ప్రసాద్, రమేష్, హిందూపూర్ ఇంజనీర్ హరనాథ్ హాజరయ్యారు.

## ప్రతిభ విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**అంకుశం న్యూస్ తూర్పుగోదావరి జిల్లా మే31:** బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో రంగంపేట ,అనపర్తి , బిక్కవోలు మండలాల్లో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట ఐసిడిఎస్ ప్రాజెక్టు తరపున ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి టి శ్రీదేవి వారి ఆధ్వర్యంలో పదో తరగతి పరీక్ష ఫలితాలలో టాపర్స్ గా నిలిచిన విద్యార్థుల్ని అభినందిస్తూ, ఒక్కొక్క మండలానికి ఆరుగురు చొప్పున అనగా ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలు చొప్పున మొత్తం 18 మందికి ఒక్కో విద్యార్థికి ఫైలు, జ్యూట్ బ్యాగ్, వాటర్ బాటిల్ ను విద్యార్థులకు అందచేసిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ కార్యక్రమంలో బిక్కవోలు మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనంతపురం ఆర్డీవోకు ఘన పదవీ విరమణ సన్మానం



**అంకుశం న్యూస్, అనంతపురం, మే 31:** అనంతపురం డివిజన్ ఆర్. డి. ఓ. ఆదికేశవుల నాయుడు రిటైర్డ్ అయినా సందర్భంగా మందకృష్ణ, యం. ఆర్. పి. ఎస్ దాస్ లతో పాటు పరువు ఘనంగా సన్మానించారు. ఆర్డిఓ సేవలను కొనియాడారు.

# ఘనంగా వాల్మీకి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ వేడుకలు

**అంకుశం న్యూస్ ధర్మవరం; మే 31 :**పట్టణంలోని పుట్టపర్తి రోడ్ సాయి నగర్ లో గల శ్రీ శిరిడి సాయి కళ్యాణ మండపంలో శ్రీ సత్య సాయి వాల్మీకి ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా వాల్మీకి ఉద్యోగుల సంఘం శ్రీ సత్యసాయి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వాల్మీకి సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అంబికా లక్ష్మీనారాయణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పొగాకు రామచంద్ర, పదమద్దల రంగయ్య, వాల్మీకి ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగాధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా వాల్మీకి సంఘం అధ్యక్షులు నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, కోశాధికారి రామకృష్ణ, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఈశ్వరయ్య, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు, ఆర్గనైజర్ శివయ్య తదితరులు ముఖ్య





అతిథులుగా పాల్గొన్నారు అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ కేవలం వాల్మీకి విద్యార్థులను ప్రోత్సహించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, వారి అభివృద్ధి మా లక్ష్యము అని వారు తెలిపారు. మనిషి జీవితంలో ఎదగడానికి మూఢనమ్మకాలు రూపుమాపడానికి లక్ష్యసాధనకు చదువు ఒకటే ప్రధాన ఆయుధమని, అందుకే ఆ దారిలో అందరూ విద్యార్థులు పయనించాలని వారు పిలుపునిచ్చారు. వాల్మీకి కులస్తుల యొక్క ముఖ్య లక్ష్యం ప్రతి ఒక్కరూ జీవితంలో ఎదగాలన్నదే మా ఆశయము అని తెలిపారు. ఈ విద్యార్థులను వాల్మీకి కులస్తులు ఆశీర్వదించినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ నరేంద్ర, ఉపాధ్యాయులు, సీనియర్ నాయకులు బి.కె ముత్యాలప్ప, ఇంజనీర్ జగదీష్ ,నాగప్ప, నాగరాజు, శివయ్య పోతులయ్య వెంకటేశు సూర్యనారాయణ చెన్నుడు సంజీవప్ప లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం

– వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్న

**అంకుశం న్యూస్, పోరుమామిళ్ల, మే 31 :** స్థానిక మదర్ థెరిస్సా ఫౌండేషన్ హాల్ నందు ఆదివారం వాల్మీకుల ఆత్మీయ సమ్మేళనం బద్వేల్ నియోజకవర్గం వాల్మీకి సంఘం అధ్యక్షులు మానం ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులికొండన్నతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వాల్మీకి సంఘం నాయకులు హాజరుకావడం జరిగింది. గౌరవ అతిథులుగా రంగసముద్రం పంచాయతీ మాజీ సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర వాల్మీకి సంఘం అధ్యక్షుడు పులికొండన్న మాట్లాడుతూ... వాల్మీకులందరూ సమైక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని, అందరినీ సంఘటిత పరిచే విధంగా గ్రామస్థాయి నుంచి పనిచేయాలని జిల్లా నాయకులకు ఆయన సూచించారు. ఎస్టీ పునరుద్ధరణ కొరకు అలుపెరగని పోరాటం చేయాలని, అందుకు ప్రతి



వాల్మీకి రోడ్డు మీదకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వున్న 50 లక్షల మంది వాల్మీకులు ఒక్కసారి రోడ్డు మీదకు రాగలిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చుక్కలు కనిపిస్తాయి అన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో కచ్చితంగా ఇటువంటి పరిస్థితి తీసుకొచ్చి డబుల్ ఇంజన్ సర్కార్ మెడలు వంచి మన డిమాండ్లు సాధించుకుందామన్నారు. ఆగస్ట్ 14 న జాతీయ రహదారి దిగ్బంధం చేసే దిశగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని, అప్పుడుగాని పాలకులు దారికిరారని అన్నారు. గ్రామస్థాయి నుంచి చైతన్యం తీసుకురాగలిగితేనే మన పోరాటం విజయవంతమౌతుందని, మన జాతికి న్యాయం జరుగుతుందని అన్నారు. గౌరవ అతిథి జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ మాట్లాడుతూ... ఐక్యత లేకపోతే సంఘం వెనకబాటుతనంలో ఉంటుందని, ఇంట్లో కూర్చుంటే అభివృద్ధి ఉండదని, రోడ్డు మీదకు వచ్చి పోరాటం చేస్తేనే సంఘం బలోపేతం అవుతుందని సూచించారు. వాల్మీకి సంఘం నాయకులు తనవద్ద వున్న వనరులను సంపూర్ణంగా ఉపయోగించుకోవచ్చునని, నా సహకారం ఎల్లపుడు సంఘం నాయకులకు ఉంటుందని చిత్త రవి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు కర్నూల్ జిల్లా నుంచి ఉగ్ర నరసింహులు, నెల్లూరు జిల్లా నుంచి బత్తుల గోపి, కావలి నుంచి మండ్ల నారాయణ, వాల్మీకి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలు స్వామి, రాష్ట్ర అధికార పవన్ గోపాల్, దుత్తలూరు నుంచి చల్లా వెంకట్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటకు సాగునీరు విడుదల చేసిన మంత్రులు, ఎంపీలు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

**అంకుశం న్యూస్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మే31:** ఈ సందర్భంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ...ఈరోజు ఏదైతే గోదావరి జలాల్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి మరి ఎవరైతే ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ





చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో అద్భుతమైన కార్యక్రమం జరిగిందని. వారి ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గోవడం ఆనందంగా ఉందన్నారు. అంతేకాకుండా నేను వ్యక్తిగతంగా ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలియజేస్తా ఉన్నాను.ఎందువల్ల అనగా నేను గత రెండు సంవత్సరాల్లో అసెంబ్లీలో రెండు విషయాలు ప్రస్తావించాను. మొదటిది ఏదైతే కాటన్ బ్యారేజ్ నిర్లక్ష్యానికి గురైందో వైఎస్ఆర్సిపి ప్రభుత్వ హయంలో గేట్లు రిపేర్ చేయకుండా ఉన్నారో దాన్ని రిపేర్ చేయాలి అనేది విషయం ప్రస్తావించిన వెంటనే ముఖ్యమంత్రి నిధులు మంజూరు చేశారు. రెండో విషయం గోదావరి కాలుష్యం శాశ్వత నివారణకు చర్యలు తీసుకోవాలని ఒక సందర్భంలో కోరడం దానికి ఇవాళ ఉపముఖ్యమంత్రి స్పందించి గోదావరి కాలుష్య నివారణ కోసం ఒక ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్తున్నందుకు వాళ్ళద్దరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, ముఖ్యశీగా రైతాంగానికి నేను చేసే విజ్ఞప్తి ఏంటంటే ఎల్నినో ప్రభావంతో ఋతుపవనాలు ఏ విధంగా ఉంటాయి అనేది ఇవాల్టి వరకు అంచనా లేదు.అందువల్ల నీటిని పొదుపుగా వాడుకోవడం ఒకటి పక్క అయితే ఎరువులు,పురుగు మందులు ఇవాళ యుద్ధం కారణంగా కొంత క్రైసిస్ ఏర్పడుతున్న నేపథ్యంలో అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న దిశలో రైతులు ఎరువులు,పురుగు మందులు తక్కువగా వాడి నీటిని కూడా పొదుపుగా వాడుకొని వారి పంటకి ప్రభుత్వం ఏ విధంగా సహకారం అందిస్తా ఉందో దాన్ని అంది పుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎంపీలు తంగేళ్ళ ఉదయ్ శ్రీనివాస్, సాన సతీష్,జీఎం హరీశ్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ పేరబత్తుల రాజశేఖరం, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్,వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి,కూటమి నాయకులు ,రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే యుటిఎఫ్ ధ్యేయం

– యుటిఎఫ్ రాష్ట్ర ఎడిట్ కమిటీ మెంబర్ ఎస్ వి వి రమణయ్య,రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ

**అంకుశం న్యూస్ ఉరవకొండ మే 31:** ప్రభుత్వ బడులను బలోపేతం చేయడమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా యుటిఎఫ్ కృషి చేస్తుందని అందులో భాగంగానే ప్రభుత్వ బడులలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర ఎడిట్ కమిటీ మెంబర్ ఎస్ వి వి రమణయ్య,రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ పేర్కొన్నారు.ఆదివారం యుటిఎఫ్ ఉరవకొండ జోన్ పరిధిలోని విడపనకల్, వజ్రకరూర్, ఉరవకొండ మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలలో 10వ, తరగతి చదివిన విద్యార్థిని, విద్యార్థులకు ఉరవకొండలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కావలి శేఖర్ ఆధ్వర్యంలో అభినందన సన్మాన సభను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రమ్మ,రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ రమణయ్య, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోటేశ్వరప్ప, ఈశ్వరయ్య, జిల్లా సహా అధ్యక్షులు రామప్ప చౌదరి హాజరై మాట్లాడారు.2025 – 26 సంవత్సరములో ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా 575 మార్కులు కన్న ఎక్కువ సాధించడం హర్షించదగ్గ విషయం అన్నారు.ఉపాధ్యాయులు పాఠశాలలో చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా వింటూ తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని దృష్టిలో పెట్టుకొని విద్యార్థిని, విద్యార్థులు క్రమశిక్షణతో ఎప్పటికప్పుడు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు.ఉత్తమ ఫలితాలు సాధించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. నేటి బాల



బాలికలే భావి భారత పౌరులుగా ఎదిగి కుటుంబానికి ,సమాజానికి ఉపయోగకరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని ,సెల్ఫోన్, టీవీలుచూడడం తగ్గించాలన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సహకరించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇంగ్లీష్ మీడియం అందుబాటులో ఉన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించుకోవాలన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఒక మెమొంటో తోపాటు, బహుమతి,మరియు వెయ్యిరూపాయలు నగుదు ఇచ్చి ప్రోత్సహిస్తూ అభినందన సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉరవకొండ మండలంలో అత్యధిక మార్కులు సాధించిన నక్షత్ర 578,సాత్విక్ 575,పవన్ కుమార్ 575,విడపనకల్ మండలంలో విద్య 587,నస్రిన్ బేగం 574,అనూష 572 మార్కులు,వజ్రకరూర్ మండలంలో పల్లవి 569,మినీహాజ్ 564, నందకిషోర్ 560 మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఉరవకొండ జోన్ నాయకులు శ్రీనివాసులు, ఉమాపతి, రఘు, లక్ష్మీనారాయణ ,రాంబాబు, ఇస్లాం భాష,సుధాకర్, చంద్రమోహన్, పోతప్ప, విశ్వనాథ్, ఎర్రిస్వామి ,మైలార్, గుప్తా, సంతోష్,మధుబాబు, శివి, జయరాములు, లక్ష్మీదేవి, మురళి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఇటీవల అంకుశంలో వార్త కి స్పందన

– మరుగుదొడ్ల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

**అంకుశం న్యూస్ తూర్పుగోదావరిజిల్లా మే31:**అనపర్తి దేవి చౌక్ వద్ద గల బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శనివారం స్థలం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి



మాట్లాడుతూ ముఖ్యంగా ఇక్కడ నుండి అటు రాజమహేంద్రవరం, ఇటు కాకినాడ వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ప్రధానంగా స్త్రీ శక్తి పథకం ప్రారంభించిన తర్వాత మరింతగా ప్రయాణికులు పెరగడం జరిగిందని తెలిపారు. దీంతో ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామపంచాయతీ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణం చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా కూటమి ప్రభుత్వం పరిష్కరించేందుకు ముందుంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు కూడా ఎల్లవేళలా కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎమ్మెల్యే బస్టాండ్ వద్ద మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టడంతో బస్సు ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఆనందం, హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాగా మొట్టమొదటిసారిగా అంకుశం న్యూస్ దినపత్రికలో "మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, "పేరు గొప్ప ఊరు దిబ్బ"అన్న చందంగా అనపర్తి బస్టాండ్ అనే వార్త వెలువడిన సంగతి విదితమే.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మండ రామకృష్ణారెడ్డి, అనపర్తి మండల టిడిపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను),మల్లిడి ఆదినారాయణ రెడ్డి,మామిడిశెట్టి శ్రీను, అన్నవరం తదితరులు ఉన్నారు.

## గొడ్డలి పార్టీకి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు

– వైసిపిపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు

**అంకుశం న్యూస్, అనంతపురం మే 31:** గొడ్డలి పార్టీకి మెగా డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన ఆదివారం రోజు మీడియా సమావేశం నిర్వహించారు. దేశంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని విధంగా



మహానాడు కార్యక్రమాన్ని హైబ్రిడ్ విధానంలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిందన్నారు. ఇది నారా లోకేష్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా జరిగిన తొలి మహానాడు అని అన్నారు. అందుకే రాష్ట్రవ్యాప్తంగా 1848 క్లస్టర్లలో 24 లక్షల మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారన్నారు. గతంలో నాలుగైదు లక్షల మంది మాత్రమే మహానాడులో పాల్గొనేవారు అని.. అయితే ఇప్పుడు ఏ ప్రాంతంలో వారు ఆ ప్రాంతంలోనే మహానాడులో పాల్గొనే అవకాశం వచ్చిందన్నారు. ఇది దేశంలోనే ఒక రికార్డుగా మిగిలిపోయిందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మహానాడు వేదికగానే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ చట్టసభల్లో తెలుగుదేశం పార్టీ తరఫున 33% రిజర్వేషన్ అమలయ్యేలా చూస్తామని చెప్పారన్నారు. పార్టీ తరఫున కచ్చితంగా 33% టికెట్లు మహిళలకు ఇస్తామని చెప్పడం ఒక గొప్ప నిర్ణయం అని... దీనిపై యావత్ మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. గతంలో ఎన్టీఆర్ మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించారన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చి మహిళలకు ఆర్థిక, సామాజిక గౌరవం కల్పించారని వివరించారు. ఇప్పుడు అదే బాటలోనే మంత్రి నారా లోకేష్ మహిళలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో కూడా గతంలో 23వేలు మాత్రమే సభ్యత్వం ఉండేదని.. ఇప్పుడు 80 వేలకు చేశామన్నారు. వైసిపి అంటేనే అవినీతి అరాచకాలు దౌర్జన్యాలు హత్యలు అని అందుకే ఆ పార్టీని 11 సీట్లకు పరిమితం చేశారన్నారు జగన్మోహన్ రెడ్డికి కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పులివెందుల ఎమ్మెల్యే గానే కూర్చోబెటారన్నారు. జగన్ ఇలాగే విమర్శలు చేస్తూ ఉంటే భవిష్యత్తులో ఒక్క స్థానం కూడా వచ్చే అవకాశం ఉండదన్నారు. అనంతపురం నగరంలో గతంలో 50 డివిజన్లు ఉంటే కనీసం ఒక్కచోట కూడా తెలుగుదేశం పార్టీ గెలిచిన పరిస్థితి లేదన్నారు. కానీ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 62 డివిజన్లలో 4 పంచాయతీల్లో గెలుస్తామని ఆ బాధ్యత కూడా నాదేనని ఆయన తేల్చి చెప్పారు. పార్టీ లైన్ దాటి ఎవరు వ్యవహరించినా అధిష్టానం దాన్ని సీరియస్ గా తీసుకుంటుందని అన్నారు. ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా తాను పనిచేస్తున్నానని.. అనవసర విమర్శలను పట్టించుకోనని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.

## మీమీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

– జూన్ 01వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ

– జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణుచరణ్

**అంకుశం న్యూస్, అనంతపురం మే 31:** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార



అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1100" అనే బ్యానర్ను ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 01వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ ఉంటుందన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 9:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ డేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.